

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మా అమ్మా - స్మార్ట్‌ఫోనూ

**మా అమ్మకి అమెరికా నుండొస్తూ** నా చిన్న కొడుకు స్మార్ట్ ఫోను కొని పట్టుకొచ్చాడు. "ఇందులో నేను ఫొటోస్ పంపించొచ్చా? చాగంటాయన్ని వినచ్చా? గరికపాటివారిని చూడచ్చా? మల్లీశ్వరి పాటలూ?" అంటూ సవాలక్ష ప్రశ్నలడిగితే "ఆటంబాంబు కూడా కనిపెట్టొచ్చు. దీన్ని గూగులమ్మ దేవతంటారు. దీన్ని భక్తితో కొలిచి ప్రతిరోజూ నేనున్నన్నాళ్ళూ పరవాన్నం, సొజ్జప్పాలు, బొబ్బట్లూ చేసి నివేదించి, నాకింత పెట్టి పూజ చెయ్యాలి.. అభిషేకాలవీ చెయ్యకూడదుస్మీ!" అని వాడు వాళ్ళ అమ్మమ్మకి ఇచ్చాడు.



"వైరు లేని ఫోన్ వస్తుందని బ్రహ్మంగారు కూడా చెప్పలేదే?" అని ఆవిడ తెగ ఆశ్చర్యపోతే "వై బ్రహ్మానందం షుడ్ టెల్ ఎబౌట్ దిస్?... ఇన్ వాట్ వే హీ ఈజ్ రిలేటెడ్?" అని మా అక్క కూతురు ఆంగ్లంలో బోలెడు ఆశ్చర్యం ప్రకటించింది.

ఇంక మా అమ్మకి అది వాడడం నేర్పడం బ్రహ్మతరంకాలేదు. చూపుడు వేలు దానికి తగిలితే కీ పాడ్ రిలీజ్ అవుతుంది అని చెప్పినా, వేలు స్క్రీన్‌కి తగిలితే ఎక్కడ షాక్ కొడ్తుందో అన్నట్లు పైపైన ఆడించడం "అది రాలేదు. నీ మాటే వింటోంది" అని చిన్నపిల్లలా పితూరీలూ మామూలై పోయాయి. మా పెద్దాడు "నీకు కావలసింది గూగుల్ గ్లాస్. కొన్నాళ్ళకి మనసులో మాట కూడా తెలిసి విండోస్ ఓపెన్ అవుతాయి. నీ అంత పురోగమించలేదు శాస్త్రజ్ఞానంలో వీళ్ళు. ప్రస్తుతానికి సర్దుకో" అని చెప్పడంతో సర్దుకుంది.




ఇంక ఆవిడ నన్ను ఏ పనీ చేసుకోనివ్వకుండా "ఇది చూడు వాట్సప్‌లో పంపుదాం అంటే తెరుచుకోడం లేదూ, ఫోన్ తీసేలోపలే కదిలిపోతోంది" అంటూ నన్ను పగలు పనిచేసుకోనివ్వకుండా, రాత్రుళ్ళు నిద్రపోనివ్వకుండా తగులుకుంటుంటే, మావారికి అప్పజెప్పాను. ఆయన బీ.పీ అమాంతం, ఆపరేటస్ బద్దలయ్యే లెవెల్‌కి రావడంతో అసలే మావారు పరశురాముడికి అన్న సహనంలో. మా అమ్మకి ఓ ట్యూటర్‌ని పెట్టా. వాడూ

మా డ్రైవర్. మాలా తిట్టలేడుగా.. సహనంతోనే నేర్పించాడు. వాడేం నేర్పించాడో, ఈవిడేం నేర్చుకుందో కానీ, మా అబ్బాయి ఫ్రెండ్‌కి అర్ధరాత్రి ఓ మెసేజ్ పంపించిందంట. "a c x y z n p o t s q r v???" అని,

సుశాంత్ గాడు ఆ మెసేజ్ బామ్మ దగ్గరనుండి వచ్చింది, ఏ భాషలోనే తెలీక.. పైగా ఇన్ని క్వశ్చన్ మార్క్స్ పెట్టి నిలదీస్తోంది. ఎలా జవాబు చెప్పాలో అర్ధంకాక, తెల్లారే పరిగెత్తుకొచ్చాడు.

"ఈ మెసేజ్‌కి అర్ధం ఏవిట్రా?" అని మా చిన్నాడ్ని అడిగాడు.

"అది ఏ ఐ.ఎస్.ఐ ఏజంట్‌దో కోడ్" అని మా చిన్నాడు కూల్‌గా జవాబిచ్చాడు.

"మరి బామ్మ దగ్గరనుండొచ్చింది?" అన్నాడు వాడు.

"ఈవిడ ప్లాంటర్ ఏమో ఎవరికి తెలుసు. మన ఓ ప్రసిద్ధ TV CEO కుడా కరాచీ వాడనీ ఇంకేదో అనీ న్యూస్ రాలేదా? ప్లాంటర్స్‌ని మా అమ్మ కూడా పుట్టనప్పటినుండీ ప్లాంట్ చేస్తారు" అన్నాడు వీడు.

ఈలోగా ఇంకో ఉపద్రవం జరిగింది. అమెరికాలో వుండే మా చిన్నక్క మొగుడు, ఈవిడ ఓ వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేస్తే జాయిన్ అయ్యాడట. ఈవిడ ఇలా పిచ్చి పిచ్చి మెసేజెస్ ఇస్తోందని, నేను మా అమ్మ వాట్సప్ డిలీట్ చేసేసా. ఆయనకి చాలా అలక వచ్చింది. "అత్తగారు గ్రూప్ ఓపెన్ చేసారు. నేను జాయిన్ అవగానే, ఆవిడ గ్రూప్ క్లోజ్ చేసేసారు. ఇది బావుందా?" అని మా అబ్బాయికి మెసేజ్ పెట్టారుట.

నేను కుటుంబ కలహాలకి ఈ స్మార్ట్ ఫోన్ కారణం అవడం చూసి విస్తుపోయాను. అసలు ఈవిడ ప్రొద్దుటే యూ ట్యూబ్‌లో ఏదో ఓ పాత సినిమా వెతికి పెట్టేసుకోవడంతో, మా ఆయన టీ.వీలో ట్రంప్ వార్తలు చూస్తుండగా భానుమతి మధ్యలోకి వచ్చి "పిలిచినా బిగువటరా.. ఔరౌరా..." అంటుంటే ఆయన రిమోట్ పాడయిందనుకున్నారు. ఇదంతా మా వాడు టీ.వీకి అమర్చిన క్రోమ్‌కాస్ట్ మహత్యం. మా అమ్మ మహదానందంలో మునిగి మల్లీశ్వరి చూస్తూ ముందు గదిలో కనిపించడంతో నాకు పరిస్థితి అర్ధమైంది.

నేను కళ్ళద్దాలు లేకుండా ఏ పనీ చెయ్యను కానీ, మా అమ్మకి కళ్ళద్దాలు పెట్టుకోడం, మెట్లు ఎక్కేటప్పుడుగానీ, నడిచేటప్పుడు గానీ ఎవరైనా చెయ్యి పట్టుకోవడం వాగాయిత్యం! ఆవిడ చెయ్యి యూట్యూబ్‌లో క్రోమ్ కాస్ట్‌కి తగిలి, ప్రధానమంత్రి మన్‌కీ బాత్ చెప్తుంటే, "అమ్మనీ తియ్యనీ ముద్దు" అని ఆయన మొహం మీదకెళ్ళి శ్రీదేవి పాడ్డం మొదలెడ్తోంది. ఇన్ని చేసే ఈవిడ, ఫోన్ వస్తే మాత్రం ఏదో బూచిని చూసినట్లు మెట్లన్నీ ఎక్కి నాదగ్గరకి "ఫోన్ వస్తోంది చూడు. షిరిడీ నుండి అల్కా.. త్వరగా తియ్యి" అని పరిగెత్తుకొస్తుంది.



ఇంతకీ ఈవిడకి అస్తమానం ఫోన్లు ఈవిడ హెడ్ ఆఫీస్ షిర్డీనుండొస్తాయి. అల్కా అంటే అక్కడ లైన్స్‌లో నిలబడే హోం గార్డ్. సనాతన్ అంటే అక్కడ సాయి కాటేజ్‌లో పనిచేసే కేర్ టేకర్. లేదా ప్రధాన్ అంటే 'సకోరి'లో పూజారి. ఇలా ఈవిడకి అక్కడ టాక్సీ డ్రైవర్లు దగ్గరనుండీ ఎడతెరపి లేక ఫోన్స్ చేసి 'ఆపరేషన్ షిర్డీసాయి'లా, "ఇవాళ దర్శనం ఇలా అయిందీ, కాకడ హారతిలో మీ కోసం దణ్ణం పెట్టాం.. మాజీ.. మా అమ్మాయికి ఏవైనా పాత డ్రెస్సు తీసుకురండి, మాజీ మావాడి స్కూల్ ఫీజ్‌కి సాయం చేస్తా అన్నారుగా" అంటూ ఫోన్స్ వస్తాయి.

ఇక్కడ ఈవిడ ఆప్తమిత్రులు.. అనగా ఈవిడ వెళ్ళే బ్యాంక్‌లో క్లర్క్, లేదా ఫ్లాట్స్‌లో వాచ్‌మెన్, లేదా, ఈవిడని చెకప్ చేసే డాక్టర్ గారూ, గ్యాస్ ఆఫీస్‌లో క్లర్క్ ఎవరైనా షిర్డీ వెళ్ళాలంటే ఈవిడ వాళ్ళకి ఫుల్ ప్యాకేజ్‌లో నాశిక్, త్రయుంబక్ దాకా ప్రయాణపు ఏర్పాట్లు చేసి, దర్శనం, టాక్సీ అన్నీ మాట్లాడి వారి ఫోన్ నెంబర్లు ఇచ్చి ఎరేంజ్

చేస్తుంది. మా అమ్మ అసలు నాలుగు నెలలు ఇక్కడుంటే ఎనిమిది నెలలు షిర్డీ టచ్‌లో వుండి, అక్కడ గ్యాస్ సిలిండర్, వంట సామాన్లతో సహా ఏర్పాటు చేసుకుని, అందరూ 'మాజీ' అని పిలుస్తూ ఈవిడని స్థానికురాలుగా గుర్తించే స్థాయికొచ్చేసింది.

మా అమ్మ అసలు ఆర్.టీ.సీ బస్సెక్కి దిల్‌సుక్ నగర్ నుండి సైనిక్‌పురి వచ్చేలోగానే నా జీవిత చరిత్రా, నా భవిష్యత్తూ కూడా పక్క వాళ్ళకి కంఠోపాఠం వచ్చేదాకా, ముక్కుపిండి, కోదండం వేయించి మరీ నేర్పించడం వల్ల, నాకు రకరకాల ఫోన్ కాల్స్ వచ్చేవి.

"హలో బలభద్రుని...పాత్రుని...రుని.."

"ఆ...ఆ...రమణిని నేనే... ఏం కావాలో చెప్పండి"

"సినిమాలో వేషం కావాలండీ, మీ నెంబర్ మీ అమ్మగారిచ్చారండీ."

"మా అమ్మ మీకెలా తెలుసూ?"

"మొన్న పొద్దుటే పదకొండింటికి పదహారో నెంబర్ బస్ ఎక్కి, మా అక్క కొడుక్కి ఆపకుండా విరోచనాలు అవుతున్నాయని, చూడ్డానికెళ్తున్నానా అండీ.. నా పక్కన మామ్మగారు కూర్చున్నారండీ.. నా పేరు కుమారండీ.. కానీ పెళ్ళయిందండీ!"

"అమ్మా.. కుమారి అయినా పెళ్ళి కావడంలో నాకు అభ్యంతరంలేదు. మీ అక్క కొడుక్కి ఆపకుండా విరోచనాలయితే, అదేదో పవన్ కల్యాణ్ సినిమాలా నువ్వు చూడ్డానికి వెళ్ళడంలోనూ నాకు అభ్యంతరం లేదు.. కానీ... సినిమాలో నేను వేషాలిప్పిస్తానని నీ పక్కన కూర్చుని చెప్పిన మామ్మగారు మా అమ్మే అన్న విషయంలో నాకు అనుమానాలున్నాయి" అన్నాను.

"మామ్మగారన్నారు.. మీరు ఉద్యోగం అదీ లేకుండా, ఇంట్లో ఖాళీగా వుంటే, తనే సినిమాకి కథలు రాయచ్చు కదే అన్నారనీ, మీరు ఆవిడ మాట విని మొదలెట్టి రచయిత్రి అయ్యారనీ.. అందుకే నేనూ పనీపాటా లేకుండా వున్నానండీ.. ఖాళీగా."

"తెలుస్తూనే వుంది"

"అందుకే మీ దగ్గరకొస్తే సినిమాలో వేషమో లేదా రచయిత్రినో చేస్తారని ఆశ!" అనగానే.

"అమ్మా... అర్థం అయింది.. నీ పక్కన కూర్చుని పనీపాటా లేని వాళ్ళు సినిమా రంగంలోకి రావచ్చనే అమూల్యమైన అభిప్రాయం వెలిబుచ్చిన మామ్మగారు మా అమ్మే! సందేహం లేదు.. కానీ అంత పనికిరాని వాళ్ళని నేను రికమెండ్ చెయ్యను."

"అదికాదండి నేను మామ్మగారిచ్చిన ఎడ్రెస్ ప్రకారం మీ ఇంటిదాకా వచ్చానండీ.."

"పెట్టెయ్ ఫోన్. వెళ్ళి మీ అక్క కొడుకు విరోచనం ఎలా అవుతోందో చూసుకో" అని కట్ చేసి బి.పి టాబ్లెట్ వేసుకున్నాను.

ఈ రకంగా మా అమ్మకి పబ్లిక్ రిలేషన్స్ శాఖలో ఇంట్రెస్ట్ ఎక్కువ.

"షిరిడీలో పక్క గదిలో దిగిన తూర్పు గోదావరి జిల్లా నుండొచ్చిన సాయీశ్వర్రావుకి దిల్‌రాజుగారు బాగా తెలుసుట. నీ దగ్గర కథ ఏదైనా వుంటే ఇవ్వంటున్నారు" అంటుంది.

నా ఇద్దరేసి శిష్యులు దిల్‌రాజ్ సినిమాలకి డైరెక్టర్లుగా వున్నప్పుడు నాకీ సాయీశ్వర్రావు రికమెండేషన్ ఎందుకూ? నా కర్థంకాలేదు.

అసలు మా అమ్మ కొన్ని మరీ దారుణమైన ఇన్‌ఫర్మేషన్స్ ఇస్తుంది. మా ఫ్రెండ్ సర్వమంగళ పళ్ళు కట్టించుకోడానికి వెళ్ళి, డాక్టర్‌తో "నా వయసుకి తగ్గట్లు కాస్త వంకరగా, పసుపు రంగులో వుండే పళ్ళు కట్టమని అడిగిందటే.. అందుకే అలా వున్నాయిట" అంటుంది.

"కింద శారద కొత్త టీవీలో వస్తున్న ఏడ్స్ మీ పాత టీ.వీలో పైన రావడంలేదు" అంటుంది.

ఇలాగే మా మొహమాటం అక్క, మా అబ్బాయి పెళ్ళి ముందురోజున అందరం ఫేషియల్స్, మెహందీ పార్లర్ అమ్మాయిని పిలిచి పెట్టించుకుంటూ, "అక్కా.. ఈ తెల్ల వెంట్రుకలేంటి? చక్కగా 'డై' చేయించుకో" అని నేను రంగు వేయిస్తే, నేను లోపలికి వెళ్ళగానే, ఆ అమ్మాయికి "వెనకాల కొంత మేర వదిలెయ్యమ్మా.. సహజంగా వుండదు లేకపోతే" అని, వెనకాల వైపు తెల్లగానే ఉంచుకుంది.

ఇంతకీ మా అమ్మ ఫ్యామిలీ గ్రూప్‌లో అందరినీ "అన్నం తిన్నారా? మీ ఆయన ఆఫీస్‌కి వెళ్ళాడా?" అని అడుగుతుంది కానీ, వాళ్ళు ఎదురు ఏం అడిగినా, ఇంక చూడదు. జవాబులివ్వదు. అసలు ఫోన్ చేసినా ఆవిడ చెప్పేవి చెప్తుందేకానీ మనం మాట్లాడ్డానికి పెద్ద అవకాశం ఇవ్వదు. అసలు సంభాషణ ఎదురెదురుగా కూడా, ఆవిడ చెప్పేవి వినడమే కానీ మనం చెప్పేది ఆవిడకి పెద్ద ఇంట్రెస్టులేదు.

సోమరాజు సుశీలగారింటికి వెళ్తూ, మా అమ్మ పెట్టిన మాగాయ చిన్న బాక్స్‌లో తీసుకెళ్ళాం.

దానికే వాళ్ళ వారు పరమానందభరితులై ఆ రెసిపీ చెప్పమని మా అమ్మకి ఫోన్ చేయించారు. మా అమ్మకి ఏనుగెక్కినంత సంబరం అయింది. అసలు భువనచంద్రగారు మనవడి పెళ్ళికి తను పిలిస్తేనే వచ్చారని అందరికీ చెప్తుంటుంది. అది నిజమేనేమో కూడా.. ఆవిడతో ఓసారి మాట్లాడి, నా అభిమానులం అంటూ వచ్చినవాళ్ళు కూడా ఆవిడ అభిమానులుగా మారడం నేను చూసాను.

మా స్కూల్లో చిన్నప్పుడు ఓసారి ఇంద్రజాలం చెయ్యడానికి ఒకతన్ని తెచ్చారు. మేమంతా ముందు వరసలో ఉన్నాం. అతను ఖాళీ చెంబులో నుండి నీళ్ళు "వాటర్ ఆఫ్ ఇండియా" అంటూ ఇంకో చెంబులో పోసి, మనకి చెంబు బోర్లించి చూపించి, మళ్ళీ "వాటర్ ఆఫ్ ఇండియా" అంటూ చెంబెడు నీళ్ళు పొయ్యడం, ఒళ్ళు గగుర్పొడిచేలా చూస్తున్నామా, వెనక బెంచీలో గుసగుసలూ, నవ్వులూ.. తలలు వెనక్కి తిప్పి చూస్తే మా సందానీగాడు, తీగ ఈ చెవిలో నుండి దూర్చి, ఆ చెవిలో నుండి తీస్తున్నాడు. అందరం చప్పట్లు కొట్టాం, వెనక్కి తిరిగి కూర్చున్నాం. వాడు సందానీగాడు నోట్లో పావలా వేసుకుని తల ఒంచి చెవిలోనించి తీస్తున్నాడు. అందరం నవ్వులు. ఆ ఆరు బూరులని వచ్చిన మెజీషియన్, తలవంచుకుని హెడ్‌మాస్టర్ గారి ముందు, సామాన్లు సర్దుకుని చక్కాపోయాడు.

ఆ నాడు ఆ ప్రసిద్ధ మెజీషియన్ తలవంచుకుని ఓటమితో సందానీ వల్ల ఎలా వెళ్ళిపోయాడో, నేను మా అమ్మ వల్ల నా అభిమానుల ముందు తలవంచుకున్నాను.

"మేం మీ అమ్మగారికే అభిమానులం.. ఏం అనుకోకండి" అని చెప్పిన శ్యామలా దశికా, మొదలైన ఎన్.ఆర్.ఐలు అందుకు ఉదాహరణ. అంతెందుకు మా క్లోజ్ ఫ్రెండ్ సుశీలా, ఈయన ఎక్స్ కొలీగ్ బాలా కూడా "మీరొచ్చారని తెలిసి చేతిలో పని వదిలి పెట్టి పరిగెత్తుకొచ్చాం పిన్నీ.. ఎన్నాళ్ళయిందో మీ మాటలు విని" అంటుంటారు. మా ఆడబిడ్డయితే, అసలు పైకొచ్చి నాకేదైనా సాయం చెయ్యడం కూడా మానేసి కింద అమ్మతో కబుర్లలో మునిగిపోతుంది.

ఈ మధ్య దేవుడి ధ్యాసలో పడిన ఈవిడ టీ.వీ చూడడంలేదు. స్మార్ట్ ఫోన్ వచ్చాకా, పైకొచ్చి "ఆ శ్రీరెడ్డి అంత పెద్ద స్టారా? నువ్వు ఒక్క సినిమా కూడా ఆవిడతో చెయ్యలేదేమే?" అంది నిష్టూరంగా. ఏం చెప్పాలో నాకు అర్థం కాలేదు. నీళ్ళు నమిలాను.

ఈవిడే టీ.వీకి రిమోట్ కంట్రోల్ వచ్చిన కొత్తల్లో, పి.వి.నరసింహారావుగారో ఎవరో పోతే చూస్తూ, మా వారు ఛానెల్ మార్చడంతో "షారూక్ ఖాన్ కూడా వెళ్ళాడే పాపం వెళ్తే వెళ్ళాడు.. డోలీ సజాకే రఖనా.. ఆ పాట ఏవిటీ? సందర్భం ఉండొద్దూ?" అంటూ విసుక్కుంది. మా ఆయన వేరే ఛానెల్ పెట్టారని తెలీలేదు పాపం.

బుష్ ప్రమాణ స్వీకారం అప్పుడు మల్లాది చంద్రశేఖర్ శాస్త్రిగారిని కూడా పిలిచారని ఆనందపడిందో మాటు. నేను రిమోట్ చూపించి దీన్ని ఉపయోగించి కూర్చున్న చోటు నుండే ఛానెల్ మార్చచ్చు. అని చెపితే, పెద్దగా నవ్వి "మీ వదిన మీ అన్నయ్యని కంట్రోల్ చేసినట్టు" అంది. ఆవిడకి సెన్సాఫ్ హ్యూమర్ కూడా చాలా ఎక్కువ.

ఆవిడకి ఫేస్‌బుక్ మాత్రం నేర్పించకపోతే మా డ్రైవర్ అంతే చాలు నాకు. లేదా ఇంటి గుట్టు రచ్చ రచ్చ.. "మైసూర్ పాక్ నువ్వు చేసానని పెట్టావేమో.. మీ ఆయన కదా చేసింది" అని కామెంటేస్తుంది నా పరువుపోయేట్లు..

ఇంతకీ ఎవరికి ఏ మెసేజ్ పంపేస్తోందో కింద.. N V Q S T Y 2 B C R ??? అంటే ఒక్కొక్కరూ గింగరాలు తిరుగుతారు సమాధానాలు చెప్పుకోలేక.. మా సందానీ ఇలాగే జనరల్ నాలెడ్జ్ పేపర్లో "NH3 అంటే తెలుసా?" అంటే "నీకే కోడిగుడ్డూ, సీసం

పెంకలూ, గమ్ కలిపి నూరి మాంజా చెయ్యడం వస్తుందీ?" అని ఎదురు ప్రశ్న రాసొస్తే, మా సైన్స్ టీచర్ గింగరాలు తిరిగాడు ఓసారి. జనరల్ నాలెడ్జ్ ఒకరి సొత్తుకాదు.

Post your comments




